

జెసి.ప్రభాకర్‌రెడ్డి తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పట్ల సోమవారం నాడు అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తీరును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు నిరసనలు తెలిపారు. కలెక్టర్‌కు మద్దతు తెలుపుతూ ప్రభుత్వ ఉద్యోగులు వారివారి కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతపురం జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లోనూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యాలయ విధుల్లో పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, డీఆర్డీఏ, చేనేత, జౌళి శాఖ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది తమ కార్యాలయాల వద్ద నిరసన తెలిపి జెసి.ప్రభాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్పందన కార్యక్రమంలో జెసి.ప్రభాకర్‌రెడ్డి ఎంత దురుసుగా ప్రవర్తిస్తున్నా కలెక్టర్ సంయమనం కోల్పోకుండా వ్యవహరించారని ఉద్యోగులు తెలిపారు. కలెక్టర్ స్థాయి అధికారిపై జెసి.ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేమనీయం అని, తక్షణం ఆయన క్షమాపనలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

గ్రీన్ జిల్లాగా మారుద్దాం

◆ లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం ◆ కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

విరివిగా మొక్కలు నాటి శ్రీ సత్యసాయి జిల్లాను గ్రీన్ జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ బసంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫిరెన్స్ హాల్‌లో ఉద్యానవన శాఖ, సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇందులో రాబోయే రెండు నెలల కాలంలో సుమారు లక్ష మొక్కలు నాటడంపై జిల్లాలోని అధికారులు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు, ఆర్డీటీ, బ్రహ్మకుమారి సంస్థ, ఎస్కే యూనివర్సిటీ, ఆర్టికల్చర్ యూనివర్సిటీ, ఇతర విద్యాసంస్థల ప్రతినిధులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభాగంలో మూడోవంతు అడవి ఉంటే పర్యావరణం సమతుల్యంగా ఉంటుందని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. సత్యసాయి జిల్లాలో అటవీవిస్తీర్ణం సుమారు 14 శాతం ఉందన్నారు. వీటిలో మొక్కలను మరింత ఎక్కువగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తున్న భవన నిర్మాణాలు, బంజర భూములు, దేవాదాయ భూముల్లో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అందరి సహకారంతో దశలవారీగా జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. మొదటి దశలో భాగంగా మూడు వారాల్లోపు 40 వేల మొక్కలను వివిధ కళాశాల విద్యార్థులు, యాజమాన్యాలు, స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా అంతట సామాజిక అటవీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. సామాజిక అటవీశాఖ ఆధ్వర్యంలో 10 నర్సరీల్లో సుమారు తొమ్మిది లక్షల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, డిడబ్ల్యూఎంఎ ఆధ్వర్యంలో 40 వేల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలైన లేపాక్షి, పెనుగొండ, హిందూపురం, తిమ్మమ్మమర్రిమాను, కదిరి ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా విధిగా మొక్కలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారిణి శ్యామల, డ్వామా పీడీ రామాంజనేయులు, సత్యసాయిట్రస్ట్ ప్రతినిధి కె.చలం, ఆర్‌డిటి సంస్థ ప్రతినిధి నాగేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ జెడి ప్రభావతమ్మ, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధి శ్రీ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం వైసిపి జిల్లా అధ్యక్ష పదవికి

కాపు రామచంద్రారెడ్డి రాజీనామా



ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్ష పదవికి కాపు రామచంద్రారెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డికి మంగళవారం లేఖను పంపారు. ఈ సందర్భంగా కాపు మాట్లాడుతూ తమ కుటుంబంలో జరిగిన విషాద ఘటనతో, పాటు రాయదుర్గం నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలపై దష్టి సారించాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో జిల్లా అధ్యక్ష పదవిని తాను నిర్వహించలేకపోతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పదవికి రాజీనామా చేశానని చెప్పారు. తన రాజీనామా విజ్ఞప్తిని మన్నించి ఆమోదించినందుకు జగన్మోహన్‌రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా అధ్యక్ష, పదవి బాధ్యతలు నిర్వహించేందుకు సహకరించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లాలోని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు కతజ్ఞతలు తెలిపారు.



పేద రైతుపై.. సర్కారు జులుం..!

రామయ్య పొలం వద్ద కంచెను తొలగిస్తున్న అధికారులు

"తనకున్న ఏకైక ఆదరువు మూడున్నర ఎకరాల భూమి. దాన్ని బలవంతంగా లాక్కుని, తమ బతుకులను బజారుపాలు చేయొద్దు" అంటూ ఒక పేద రైతు గడిచిన ఏడేళ్లుగా పోరాడుతూనే ఉన్నాడు. అయితే సర్కారు ఎలాగైన ఆ భూమిని వారు అనుకున్న సంస్థకు కట్టబెట్టాలని సర్వ శక్తులనూ ఉపయోగించి జులూం సాగిస్తోంది. అండగా నిలవాల్సిన అధికారులే అన్నీ లాక్కునేందుకు సిద్ధపడుతున్నారు. కనీసం మార్కెట్ ధర ప్రకారమైనా పరిహారమివ్వమంటే ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. అరకొర పరిహారమే ఇస్తాం ఖాళీ చేయమని నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో తన బాధ ఎవరితో చెప్పకోవాలో పాలుపోక ఆ పేద రైతు దిక్కులు చూస్తున్నాడు. సత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల పరిధిలోని పాలసముద్రం వద్ద ఓ రైతు పడుతున్న కన్నీటి వ్యథ ఇది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

◆ పొలం చుట్టూ వేసిన కంచె తొలగింపు ◆ న్యాయం చేయమన్నందుకు నిర్బంధం ◆ పెద్దవారి పట్ల ఉదారత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సోమందేపల్లి మండలం పాలసముద్రం గ్రామానికి చెందిన వి.రామయ్య యాదవ్ అనే రైతు తన తాతలకాలం నుంచి వస్తున్న 3.50 ఎకరాల పొలాన్ని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతోపాటు, పొలం పక్కనే చిన్నపాటి టీ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కాగ రాష్ట్ర విభజన అనంతరం పాలసముద్రం వద్ద నాసిన్ సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధపడింది. దీనికి 550 ఎకరాల భూమిని కేటాయించారు. ఇందులో అత్యధికంగా నిరుపేద రైతులే ఉన్నారు. ఇందులో రామయ్య మూడున్నర ఎకరాల పొలమూ ఉంది. అయితే రామయ్య ఉన్న ఒక్క ఆదరువు ఇవ్వడానికి సిద్ధపడలేదు. దీన్ని నాసిన్ సంస్థకు ఇవ్వనని చెప్పాడు. కాని అధికారులు మాత్రం ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో ఏమి చేయాలో పాలుపోక 2016లో హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం దీనిపై స్టే ఇచ్చింది. కొంతకాలం మౌనంగానున్న అధికారులు తరువాత పొలానికి విద్యుత్ సరఫరాను నిలిపేశారు. దీంతో రామయ్య మరోమారు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో విద్యుత్‌ను అధికారులు పునరుద్ధరించక తప్పలేదు. ఇప్పటికీ ఈ కేసు న్యాయస్థానంలో నడుస్తూనే ఉంది. ఆయన అంగీకారం మేరకు చర్యలు తీసుకోవాలన్న మార్గదర్శకాలను న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. అయితే అధికారులు ఆ దిశగా కాకుండా ఏదోరకంగా రామయ్యను పొలం నుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలనే చేస్తుండటం గమనార్హం. పొలం చుట్టూ కంచె వేసుకున్నందుకు మంగళవారం నాడు పోలీసు బలగాలతో తహశీల్దార్ అక్కడికి విచ్చేసి కంచెను తొలగించారు. తన పొలంలో తాను కంచె వేసుకున్నానని రామయ్య చెబుతున్నా పట్టించుకోకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా తొలగించారు. కోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోకుండా మూడు ఎకరాలు ఖాళీ చేయాల్సిందేనన్నట్టు అతడిపై అధికారులు ఒత్తిడి పెంచుతుండటం గమనార్హం.



నాసిన్ ప్రధాన ద్వారం వద్ద నిర్మితం అవుతున్న విల్లా



బాధిత రైతు వి.రామయ్య

పెద్దల భూమిపై ప్రేమ

ఇదే భూమికి కొంత దూరంలో ఒక వ్యక్తి రియల్‌ఎస్టేట్ సంస్థ పేరుతో 59 ఎకరాలను కొనుగోలు చేశాడు. ఇందులో సుమారు 24 ఎకరాల భూమి అసైన్డ్‌గా ఉంది. దీన్ని కూడా రిజిస్ట్రేషన్ చేయించుకుని విల్లాల నిర్మాణం చేపట్టి యథేచ్ఛగా అమ్మకాలు సాగించారు. ఆ భూమిని మాత్రం నాసిన్ కోసం స్వాధీనం చేసుకోకుండా ప్రహరీ వెనక్కు జరిపి కట్టారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వ్యక్తం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. హిందూపురం పట్టణం వైపు వెళ్లే మార్గంలో ఉన్న నాసిన్ ప్రధాన ద్వారం పక్కనే పెద్ద భవంతిని ఆ సంస్థ నిర్మాణం చేపడుతోంది. దీనిపై కూడా అధికారులు ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఈ విల్లాల్లో కొంత మంది అధికారులకు బహుమతులున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. పెద్దలపట్ల ఇలా ఉండే అధికారులు, పేద రైతును మాత్రం నిత్యం ఇబ్బందులపాలు జేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి తనకు న్యాయం చేయాలంటూ బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నాడు.

అధికారుల తీరు దుర్మార్గం

ఉన్నత న్యాయస్థానంలో కేసు నడుస్తుండగా ఎటువంటి తీర్పురాకనే రైతు రామయ్య కుటుంబాన్ని పోలీస్ స్టేషన్లో బంధించి పోలీస్, రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా భూమిని ఆక్రమించేందుకు యత్నించడం సరికాదు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతుకు న్యాయం చేయకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు. రైతుల్ని భయభ్రాంతులకు గురిచేసే విధంగా అధికారులు ప్రవర్తించడం నీచమైన చర్య. రైతు న్యాయం చేసేందుకు ఆయన పక్షనా పోరాటం నిర్వహిస్తాం.

పెద్దన్న, వ్యకాసం జిల్లా కార్యదర్శి.



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

సర్వీసులను పెండింగ్‌లో ఉంచొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి బత్తలపల్లి

సచివాలయాలకు వస్తున్న సర్వీసులను గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం బత్తలపల్లి మండలంలోని బత్తలపల్లి -1, సంజీవపురం, పోట్లమర్రి గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఆయా సచివాలయాలలో సచివాలయ ఉద్యోగులు యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. యూనిఫామ్ ధరించకపోతే చర్యలు తీసుకోవాలని సంబందిత ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సచివాలయ వ్యవస్థలో విధులు నిర్వర్తించే ఉద్యోగులందరూ చిత్తశుద్ధితో తమ విధులను నిర్వర్తించాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈశ్రమ్ పోర్టల్ లో ఈశ్రమ్ రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్నాయని, వెంటనే పురోగతి పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని హౌసింగ్ లేఅవుట్లలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న గ్రామ సచివాలయాలు తదితర భవన నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందజేసేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులు క్రమశిక్షణ, నిబద్ధతతో వ్యవహరించాలని కోరారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల ఏర్పాటు ఉద్దేశ్యానికి వందశాతం న్యాయం చేయడానికి ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. విధినిర్వహణలో అలసత్వం వహించే ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయాల పనితీరును మండల స్థాయి అధికారులు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సాయికుమార్, తహశీల్దార్ యోగేశ్వరిదేవి, నారాయణస్వామి, రామాంజనేయులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అహుడా పరిధి 17873.66 కి॥మీ॥ పెంపు

అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం-హిందూపు రం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిని 17837.66 చదరపు కిలోమీటర్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక అహుడా కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్ తర్వాత అధిక విస్తీర్ణం అహుడా అవతరించిం దన్నారు. రాష్ట్రంలో అహుడా రెండవ స్థా నంలో ఉందన్నారు. అహుడా పరిధిలోకి అనంతపురం, సత్యసాయి జిల్లాలోని 13 నియోజ కవర్గాలు చేరాయన్నారు. పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మినహాయించి ఉమ్మడి అనంతపురం జిల్లా అహుడా పరిధిలోకి చేరింద న్నారు. అహుడా పరిధిలో జగనన్న లేఅవుట్లు, స్మార్ట్ సిటీలు నిర్మించటం ద్వారా పేద మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించ నున్నట్లు తెలిపారు. లాభాపేక్ష లేకుండా ప్రజలకు ఖరీదైన స్థలాలను తక్కువ ధరలోకి అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఆ దిశగా అహుడా అడు గులు వేస్తోందన్నారు ఇప్పటికే కుణుతూరు వద్ద జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసి స్థలాలను విక్రయించినట్లు తెలిపారు. అలాగే కోడికొండ చెక్‌పోస్ట్ వద్ద జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేశామన్నారు. అక్కడ ప్రయివేటు స్థలాల్లో సెంటు రూ.10లక్షల ధర పలుకుతోందన్నారు. అయితే జగనన్న లేఅవుట్‌లో రూ.3.5లక్షలకే సెంటు భూమిని అందుబాటులోకి తేస్తున్నామన్నారు. కొను గోలు చేసిన వారు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందు లు పడకుండా స్థలాలను అన్ని అనుమతులతో పొందవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో అహుడా వైస్ ఛైర్మన్ మురళీకృష్ణగౌడ్, ప్లానింగ్ ఆఫీసర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

సత్యసాయి కార్మికులతో అధికారుల చర్చలు విఫలం

గ్రాట్యూటీ చెల్లించేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్న నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పిఎబిఆర్ డ్యాం వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ బాషా, డిఇలు కార్మిక సంఘం నాయకులు, కార్మికులతో మంగళవారం జరిపిన చర్చలు విఫలం అయ్యాయి. గ్రాట్యూటీ చెల్లింపులకు సంబంధించి ఎల్‌అండ్‌టి కంపెనీకి లేఖ రాశామని, వారు స్పందించిన వెంటనే గ్రాట్యూటీ చెల్లిస్తామని అధికారులు తెలిపారు. మార్చిలోపు చెల్లిస్తామనడంతో యూనియన్ గౌరవాధ్యక్షులు జి.ఓబులు, ఇతర నేతలు అంగీకారం తెలుపలేదు. గ్రాట్యూటీ ఇచ్చేంత వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. చర్చలు విఫలం కావడంతో సమ్మె కొనసాగుతుందని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికుల యూనియన్ నాయకులు తిప్పేస్వామి, మహబూబ్‌బాషా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న కార్మిక సంఘం నాయకులు

ఎండ్లూరి చిద్విలాస్‌కు బంగారు పతకం

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మైరెడ్డి నీరజ

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక వైద్య కళాశాలలో ఆఖరి సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న ఎండ్లూరి చిద్విలాస్ మొట్టమొదటి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నీరజ మంగళవారం తన ఛాంబర్‌లో చిద్విలాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఆంధ్ర వైద్య కళాశాల విశాఖ పట్టణం తర్వాత సైకియాట్రిలో గోల్డ్ మెడల్‌ను అందిస్తున్న రెండవ కళాశాలగా అనంతపురానికి గుర్తింపు తీసుకురావడంలో కృషి చేసిన సెకియాట్రి హెచ్‌ఒడి డాక్టర్ వైద్యనాథ్‌ను, తన తండ్రి జ్ఞాపకార్థం తన సొంత డబ్బులతో గోల్డ్ మెడలను అందిస్తున్న డాక్టర్ అనిల్ కుమార్‌ను, ఇతర సైకియాట్రి డాక్టర్లను అభినందిస్తున్నానన్నారు. అంతేగాకుండా మొట్ట మొదటి గోల్డ్ మెడల్‌ను సాధించిన స్ఫూర్తిగా తీసుకుని జూనియర్ విద్యార్థులు మరింత బాగా చదివి మానసిక శాస్త్ర వైద్య జ్ఞానాన్ని మానసిక రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్ సోనియా, సైకియాట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ శారద, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వరదరాజులు, డి.అడిక్షన్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శశాంక్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

చిలమత్తూరు : మండల పరిధి లోని శెట్టిపల్లి గ్రామ పంచాయతీ కేంద్రంలో మంగళవారం స్థానిక ఎంపిటీసి జగన్ మోహన్ రెడ్డి, సర్పంచి ఎద్దుల చామంతి ఆధ్వర్యంలో పీస్ వెల్ఫేర్ సొసైటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ పంచాయతీల నుండి వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు 40 మందిని అపరేషన్లకు రెఫర్ చేశారు. వీరికి ఆల్ట్రా విజన్ పుట్టపర్తి వారిచేయత ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని ఎంపిటిసి జగన్ మోహన్ రెడ్డి, డాక్టర్ బొగ్గు సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక వైసిపి నాయకులు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వ్యాధి నిరోధక టీకాల విభాగపు జిల్లా అధికారి కష్ణయ్య మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం కేతగాని చెరువు సచివాలయం వద్ద 104 ద్వారా జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేష్ కుమార్, డాక్టర్ హరికుమార్, జిల్లా జూనియర్ అసిస్టెంట్ బాబాఫక్రుద్దీన్, సిహెచ్‌ఒలు మనోహర్ రెడ్డి, మధు, పర్యవేక్షకులు సుబ్బమ్మ, రవీంద్ర, నారాయణమ్మ, రత్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

హిందూపురం : విద్యార్థి దశ నుంచే విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకుంటే ఎక్కడైనా రాణిస్తారని ఎంఇఒ గంగప్ప పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రినౌల్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పాఠశాల స్థాయి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ప్రతిభా కనబర్చిన విద్యార్థులకు ఎంఇఒ గంగప్ప, పాఠశాల కరస్పాండెంట్ బీబీజాన్, హెచ్‌ఎం ముస్తఫా ఆలి ఖాన్ తదితరులు మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యార్థి దశ నుంచే పోటీ పడి చదవాల్సిన అవసరం ఉందన్నారు. పోటీ తత్వాన్ని విద్యార్థుల్లో పెంపొందించాడానికి పాఠశాల యాజమాన్యం విద్యార్థుల సామార్థ్యన్ని గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా పోటీ పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగనాగేపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్

రొద్దం : మండలంలోని నారనాగేపల్లి సచివాలయంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని డాక్టర్ ఎం జగదీష్ బాబు ఆధ్వర్యంలో మొబైల్ మెడికల్ యూనిట్ సిబ్బంది నిర్వహించారు. ఇందులో బాగంగా రోగులకు పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం సచివాలయ పరిధిలోని బూదిపల్లిలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఒ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయండి

అమరాపురం : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన హేమవతి పుణ్యక్షేత్రంలో ఇటీవల పూజారి హత్య జరిగిన నేపథ్యంలో ఆలయంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ గ్రామానికి కర్నాటక రాష్ట్రం కూతవేటు దూరంలో ఉండడంతో అపరిచితులు ఎక్కువగా వస్తుంటారన్నారు. ఇటీవల ఆలయంలో పలు ఆభరణాలు కూడా చోరీకి గురయ్యాయని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ, పోలీసులు అధికారులు స్పందించి ఆలయ పరిసర ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచాలని కోరారు.

పాఠశాల రోడ్డుకు మరమ్మతులు


రోడ్డు మరమ్మతు పనులు

రొద్దం : ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని కోగిర ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసం అయ్యింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై స్పందించిన గ్రామ సర్పంచి రమాదేవి రామకృష్ణ రోడ్డు మరమ్మతు పనులను మంగళవారం చేపట్టారు. పంచాయతీ నిధులతో రోడ్డుకు మట్టి తొలి మరమ్మతులు చేపట్టారు. 500 మీటర్ల మట్టి రోడ్డును యుద్ధప్రాతిపదకన వేయించారు. త్వరలో సిమెంట్ రోడ్డును వేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సర్పంచి తెలిపారు. రోడ్డు వేయించడంపై ప్రధానోపాధ్యాయులు నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్పంచి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

కొత్తచెరువు : ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. గ్రంథాలయ అధికారి కె.జయరాం ఆధ్వర్యంలో తహశీల్దార్ రామాంజనేయులురెడ్డి, ఎంపీడీవో సిద్ధారెడ్డిలు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14న వారోత్సవాలు ప్రారంభం, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, పట్టణ ప్రాముఖ్యత, మారకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల సందేశాలు, 17న కవి సమ్మేళనం, సెమినార్లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్రీడా పోటీలు, 19న దిశా చట్టం, మహిళా సాధికారతపై అవగాహన, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటరెడ్డి వైసిపి నాయకులు రఘునాథరెడ్డి, సూర్యగౌడ్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సాయం


దుస్తుల పంపిణీలో పాల్గొన్న నాయకులు

కొత్తచెరువు : సమాజంలో సేవాభావం ఎంతో ఉత్తమమైనదని, ప్రతి ఒక్కరూ దీనిని కలిగి ఉండాలని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి సామకోటి కోటి ఆదినారాయణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మైలేపల్లి గ్రామం కరుణ అనాథ వద్ధాశ్రమంలో బట్టలు పంపిణీ చేశారు. మూడు ప్యాకెట్ల బియ్యం, బిస్కెట్లనూ అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామకష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, కొడపగానిపల్లి శివసాయి పాల్గొన్నారు.

భవనాలను తొలగించొద్దు

అమరాపురం : మండల కేంద్రంలో ఇరిగేషన్ స్థలంలో ఏర్పాటు చేసుకున్న భవనాలను తొలగించొద్దంటూ గ్రామసభలో తీర్మానం చేశారు. తీర్మానం కాపీని ఇదే సమావేశంలో అధికారులకు అందజేశారు. మండల కేంద్రంలోని ఇరిగేషన్ స్థలాలలో నిర్మించిన అక్రమ భవనాల తొలగింపుపై గ్రామసభలను సర్పంచి వాగేష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇ వెంకటరమణ, ఈవోఆర్డీ సుధాకర్, మాజీ సర్పంచి కె.నరసింహమూర్తి, జెఇ భార్గవ్, పంచాయతీ కార్యదర్శి ఈరన్నలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామసభల తీర్మానం మేరకు ఉన్నత అధికారులకు పంచాయతీ తీర్మానాన్ని పంపుతామన్నారు. ఈ సందర్భంగా అక్కడ నిర్మాణాలు చేసుకున్న వారు మాట్లాడుతూ తాము గత 60 ఏళ్లగా భవనాలను రెవెన్యూ, పంచాయతీ అధికారుల అనుమతి మేరకు నిర్మించుకున్నామని, ఇప్పుడు వాటిని తొలగిస్తే తాము ఉపాధితోపాటు నివాసం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి భవనాలను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయాన్ని గ్రామైసభలో తీర్మానం చేశారు. తీర్మానం కాపీని ఇరిగేషన్ డిఇకి అందించారు. ఈ తీర్మానాన్ని ఉన్నతాధికారులకు పంపుతానని డిఇ తెలిపారు.

క్రీడా వసతుల కోసం ఆర్థికసాయం

కదిరి టౌన్ : పట్టణంలో క్రీడా వసతుల నిమిత్తం దాతలు ఆర్థిక సహాయం అందజేసినట్లు కోచ్ నజీర్ తెలిపారు. కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆర్డీటీ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ కోచింగ్ క్యాంపులో క్రీడాకారులకు మెరుగైన క్రీడా వసతులు, క్రీడా పరికరాల అవసరం కోసం "పే బ్యాక్ టు క్రికెట్ గ్రూవు" కార్యదర్శి ధనుంజయ, సభ్యులు విజయ్, శ్రీకాంత్, శామ్యూల్లు రూ.25వేలు ఆర్థిక సహాయం అందించారన్నారు. దాతలు మరికొంత మంది ముందుకొచ్చి సాయం అందిస్తే కదిరి నుంచి క్రీడాకారులు తయారయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు ఆది, మస్తాన్‌ఖాన్, చంద్ర, సాయి, మహేష్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సక్రమంగా అందని రేషన్

ఓబుళదేవర చెరువు : రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదని మండల పరిధిలోని నల్లగుంట్లపల్లి గ్రామస్తులు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రేషన్‌షాపు నెంబర్ 15లో గత నెల 60 కార్డులకు రేషన్ ఇవ్వలేదన్నారు. ప్రతి నెలా ఇదే పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి రేషన్ సక్రమంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శివశంకర్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, టిడిపి తెలుగు యువత నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి చిరంజీవి, రాజారెడ్డి, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, శివారెడ్డి, నాగమణి, చిరంజీవి, సుధాకర్, ప్రభాకర్‌రెడ్డి, చంద్రకళ, శాంతమ్మ, సావిత్రి, లక్ష్మన్న, గణపతి పాల్గొన్నారు.

రవీంద్రనాయక్‌కు డాక్టరేట్ ప్రదానం

తనకల్లు : మండల పరిధిలోని రెడ్డివారిపల్లి తండాకు చెందిన బుక్కా రవీంద్ర నాయక్‌కు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. హిందీ విభాగం పరిశోధక విద్యార్థి రవీంద్రనాయక్ హిందీ విభాగం అధ్యాపకులు డాక్టర్ నారాయణ ఆధ్వర్యంలో 'బంజారా లోక్‌గీతంమే జీవన్‌కె వివిధ్ అయామ్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. దీనిపై యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రవీంద్ర నాయక్‌కు డాక్టరేట్ అవార్డు రావడంపై హైకోర్టు అడ్వకేట్ హనుమంతు నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆదెన్ననాయక్, తండావాసులు అభినందనలు తెలిపారు.

వేతనాల కోసం నిరసన

గాండ్లపెంట : పెండింగ్ వేతనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రామకష్ణ, సురేష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు వేతనాలు రాక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు స్పందించి వేతనాలు ఇప్పించే ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఈవోఆర్డీ సునీత పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలలు వేతనాలను వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కొండల్లో తవ్వకాలు


కొండ మట్టిని తవ్విన దృశ్యం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులో కొండలను స్వార్థపరులు విచ్చలవిడిగా జెసిబిలతో తవ్వి మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రెండు సంవత్సరాలుగా గ్రామ సమీపంలో ఉన్న నల్లగొండ బుక్కపట్నం రోడ్ లో ఉన్న అక్కమ్మ గారి కొండలను అధికారపార్టీకి చెందిన ఓ నాయకుడు జెసిబిలతో తవ్వి మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. రెవెన్యూ అధికారులు, జిల్లా మైన్స్ అధికారులు కానీ పట్టించుకోవటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

పెనుగొండ రహదారిలో జగనన్న కాలనీ పైభాగాన మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. దీంతో జగనన్న కాలనీలో గృహాలు నిర్మించుకుంటున్న వారికి ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అదే విధంగా అక్కమ్మ గారి కొండ వద్ద చెరువుకు సపోర్టుగా ఉన్న కొండను తవ్వేయడం ద్వారా భవిష్యత్తులో చెరువుకు ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని రైతులు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఈనేపథ్యంలో శుక్రవారం రాత్రి వేళల్లో మట్టిని తరలిస్తుండగా ఓ వ్యక్తి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ తవ్వకాలు నిలిపివేశారు దీనితో ఫిర్యాదు చేశాడన్న అనుమానంతో ఓ వ్యక్తిపై మట్టి తరలింపుదారులు ఘర్షణ పడగా ఆ పంచాయతీ పోలీసుస్టేషన్‌కు చేరింది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దోబీఘాట్లకు స్థలం కేటాయించండి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మండల వ్యాప్తంగా రజక కుటుంబాల జీవనోపాధి నిమిత్తం అన్ని గ్రామాల్లోనూ దోబీఘాట్లకు స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబులెన్స్ రమేష్, జిల్లా అధ్యక్షులు కష్ణమూర్తి కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రజకులకు దోబీఘాట్లు లేక కులవృత్తి చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓడీసీ, కొండకమర్ల, ఎం.ఎర్రపల్లి, నల్లగుట్లపల్లి తదితర గ్రామాల్లో రజకులు ఎక్కువగా ఉన్నారన్నారు. ఈ గ్రామాల్లో దోబీఘాట్లకు స్థలాను కేటాయించి, నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాపనపల్లి శివప్ప, రాష్ట్ర కార్యదర్శి తేలిక ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-తలుపుల

ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గడపగడపూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మేజర్ పంచాయతీ పరిధిలోని సచివాలయం-2 ఎస్టీ కాలనీ, ప్రకాష్ నగర్, వినాయక నగర్, ఎగువపేట, సంఘం బజార్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. నవరత్నాల పథకాలు అమలు చేస్తూ పేదల ఆర్థిక అభివద్ధికి కషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాల వల్ల ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుందన్నారు. సమస్యలు లేని ఇల్లు చూడాలనిదే జగనన్న ఆశయం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి శ్రీలత, ఎంపిపి మహమ్మద్ రఫీ నాయక్, వైస్ ఎంపిపి ఓబులేశ్వరమ్మ, ఉప సర్పంచి డికె.బాబు, పురుషోత్తమ రెడ్డి, పెద్దినాయుడు, రామకష్ణారెడ్డి, కులశేఖర్ రెడ్డి, డిపి.ఫయాజ్‌అహ్మద్, ఆవుల వివేకానంద రెడ్డి, దివాన్‌వలి, ప్రభువర్ధన్, మౌలా, అంజి, మనీ, విజయ్, చంటి, రమణ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యువతులు

ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

ప్రజాశక్తి కదిరి టౌన్

ప్లాస్టిక్ వాడకంపై మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉక్కు పాదం మోపారు. కదిరి పురపాలక సంఘం పరిధిలో వారు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. తోపుడుబండ్లు, హోటళ్లు, జనరల్ స్టోర్లలో తనిఖీ చేవారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే వాతావరణ కాలుష్యం గురించి వివరించారు, ప్లాస్టిక్ వాడుతున్న పలు షాపు యజమానులకు అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కుసుమలత, లావణ్య, షబేతజ్, రెడ్డిశేఖర్, పవన్ కుమార్, మధుసూదన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలు పెంచాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచాలని ఎపిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రావులచెరువు సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆసంఘం నాయకులు మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని ఏఒ కుప్రాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. దీంతో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయపలు తొండమాల గురప్ప, రాజు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

ప్రజాశక్తి-మడకశిర

ఆర్థికంగా వెనుకబడిన అగ్రకుల పేదలు(ఈడబ్ల్యూఎస్)రిజర్వేషన్లను తొలగించేందుకు వీలు కాదని, దాన్ని కొనసాగించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నితిన్‌రెడ్డి పేర్కొన్నారు. అగ్రకుల పేదలకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం అభినందనీయం అన్నారు.

రాజీతోనే ప్రశాంత జీవనం

ప్రజాశక్తి-అమడగూరు

మండలంలోని భూ తగాదాలు, ఘర్షణల వల్ల జీవితాలను కోల్పోకుండా ప్రశాంత జీవనాన్ని గడపాలని ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో కేసులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కేసుల్లో ఉన్న వారు లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సుధాకర్, విజయ్‌కుమార్, చంద్రహాస్, రత్నాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అందరూ ఇళ్లు నిర్మించుకోవాలి

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలోని తుమ్మల కుంట్లపల్లి గ్రామపంచాయతీలో బసప్ప గారి పల్లి తుమ్మలకుంట్ల పల్లెలో హౌసింగ్ కింద మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని ఎంపీడీవో పోలప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని తుమ్మలకుంటపల్లి తదితర గ్రామాల్లో సోమవారం పర్యటించారు. మండల వ్యాప్తంగా మంజూరైన ఇళ్ల నిర్మాణం వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. వాలెంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు ఇంటి నిర్మాణాలపై దృష్టిసారించాలని ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-తనకల్లు

శ్రీ సత్యసాయి జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఎస్‌వి.కృష్ణారెడ్డి మండల పరిధిలోని కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అక్కడ ఫామిలీ ఫిజిషియన్ విధానాన్ని పరిశీలించారు. తనకల్లు సచివాలయం-2 సచివాలయం పరిధిలోని బద్దెనాయక్ తండాలో 104 సిబ్బంది అందిస్తున్న సేవలనూ పరిశీలించారు. ఫామిలీ ఫిజిషియన్ విధానం ద్వారా ఇళ్ల వద్దనే 67 రకాల మందులు, 14 రకాల పరీక్షలను నిర్వహిస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలను వైద్యులు సందర్శించి జబ్బుతో ఉన్న పిల్లలను గుర్తించి వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. పేదలకు నాణ్యమైన సత్వర వైద్యసేవలు అందించాల్ను ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజియన్ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటరమణ, శివ నారాయణ, ఎంపిహెచ్ఇఒలు ఓబులేష్, సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డిఎం హెచ్ఒ

ఎమ్మెల్యే ఎదుట సమస్యల ఏకరువు

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని రెడ్డిపల్లి పంచాయతీ గోనిమేకలపల్లి గ్రామంలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఉమ్మడి జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ పాల్గొన్నారు. ఇందులో భాగంగా పలువురు సమస్యలను ఎమ్మెల్యే ఎదుట ఏకరువు పెట్టారు. గ్రామంలో చాకలి సునీతమ్మ ఇంటివద్దకు ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అంటూ పలకరించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ తమకు ఎలాంటి ప్రభుత్వ పథకం అందలేదని ఎమ్మెల్యే ఎదుట వాపోయింది. రజకులకు అందాల్సిన రూ.10వేల సాయం కూడా ఇవ్వలేదన్నారు. రైతు భరోసా కూడా ఇవ్వలేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలంటూ సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రశేఖర్, వైస్ ఎంపిపి అంజినరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణ రెడ్డి, తహశీల్దార్ అనంతచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, వ్యవసాయ అధికారి నివేదితతో పాటు వైసిపి నాయకులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గ్యార్మీ వేడుకలు ప్రారంభం

హిందూపురం : పట్టణ సమీపంలోని లేపాక్షి మండలం నాగేపల్లి వద్ద ఉన్న పీర్ భక్తర్‌వలి దర్గా వద్ద సోమవారం రాత్రి ఘనంగా గ్యార్మీ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీర్ భక్తర్ వలీ దర్గా కమిటీ అధ్యక్షులు మక్తీయార్ ఆధ్వర్యంలో ఉరుసు వేడుకలు ప్రారంభించారు. గురువులు అబ్దుల్ రహీమ్, మహబూబ్ భాష, షబ్బీర్ ఉస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఊరేగింపుగా గంధాన్ని తీసుకువచ్చి గంథోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం రాత్రి నెల్లూరుకు చెందిన అయిషా తాజ్, బెంగళూరుకు తబ్రేజ్ ఖాద్రీల కవ్వాలి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ శ్రీనివాసరెడ్డి, సమీవుల్లా, ఆదిరామరెడ్డి, వెంకటరమణప్ప, కిష్టప్ప, షరీఫ్, నిర్వాహకులు మహబూబ్ దౌల, నజీర్, నరసింహ్మా, మహబూబ్‌బాషాతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రజాసేవే రోటరీక్లబ్ లక్ష్యం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పేద ప్రజలకు సేవ చేయడమే రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యమని ఆ క్లబ్ అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి జయసింహ, క్యాంపు చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మంగళవారం స్థానిక సాంస్కృతిక మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈనెల 13న నిర్వహించే ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రోటరీ క్లబ్ పేద ప్రజలకు సేవ చేస్తూ దినదినాభివృద్ధి చెందడం గర్వించదగ్గ విషయమన్నారు. దృష్టిలోపం ఉన్న వారందరూ కూడా ఈ శిబిరంలో వైద్య చికిత్సలు పొందాలన్నారు. అవసరమైన వారికిఉచితంగా అద్దాలను కూడా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రత్న శేఖర్ రెడ్డి, పెద్దారెడ్డి, సుదర్శన్ గుప్తా, మనోహర్ గుప్తా, ఒవి ప్రసాద్, నాగభూషణం, శివయ్య, ప్రసన్న కుమార్, రమేష్ బాబు, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

హిందూపురం : హిందూపురం పట్టణంలోని వక్కల బజారులో నీవు కుష్ ఆల్ ఎలక్ట్రికల్ షాప్‌లో మంగళవారం జరిగిన విద్యుత్‌ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. అందుకు సంబందించిన వివరాలు... పరిగి మండలం చిన్న పల్లి కి చెందిన సాయి రాకేష్(19) ఎలక్ట్రికల్ షాపులో పనిచేస్తున్నాడు. పై అంతస్తులు ఉన్న ఎలక్ట్రికల్ సామానులను లిఫ్ట్ సహాయంతో కిందికి తీసుకురావడానికి లిఫ్టులోకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు లిఫ్టులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో యువకుడు విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే షాపు నిర్వాహకులు హితేష్, మరో కార్మికుడు రమేష్ కలిసి విద్యుత్ సరఫరాను నిలిపివేసి సాయి రాకేష్‌ను హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు సాయిరాకేష్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలిసిన వెంటనే టూ టౌన్ ఎస్ఐ భాస్కర్, ఎఎస్ఐ అక్బర్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి ఆదిలక్ష్మమ్మ ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేస్తున్న రోదనలు కంటతడి పెట్టించాయి. తనకు భర్త లేడని, ఉన్న ఒక్కగానొక్క కుమారుడు ఇలా మృతిచెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడు సాయి రాకేష్ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఈ విషయం తెలిసిన వెంటనే ఆ సంఘ ప్రతినిధులు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. మృతుని కుటుంబాన్ని షాపు యజమాని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.


మృతుడు సాయి రాకేష్

వివాహిత ఆత్మహత్య

లేపాక్షి : అనారోగ్య సమస్యలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని సిరివరం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సిరివరం గ్రామానికి చెందిన జయమ్మ, నారాయణప్పల కుమార్తె లావణ్య(25)కు గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఈమె భర్త కర్నాటక రాష్ట్రం బెంగుళూరులోని ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అప్పటి నుంచి లావణ్య తల్లిదండ్రుల వద్దనే ఉండేది. కిడ్నీ సమస్య ఇక నయం కాదని భావించిన ఆమె మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలికి ఆరు సంవత్సరాల కుమార్తె ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భారీ స్థాయిలో కర్నాటక మద్యం స్వాధీనం

హిందూపురం : హిందూపురం సెబ్ అధికారులు వివిధ ప్రాంతాల్లో మంగళవారం దాడులు నిర్వహించి, బారీ ఎత్తున అక్రమ మద్యాన్ని స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సెబ్ సిఐ లక్ష్మిదుర్గయ్య స్థానిక స్టేషన్ వద్ద విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మద్యం స్వాధీనం వివరాలను వెల్లడించారు. పరిగి మండలం చెర్లోపల్లి-సేవామందిర్ రహదారిలో దాడులు నిర్వహించి మహేంద్ర ఎక్స్‌యూవి 500 తెలుపు రంగు వాహనంలోని 16 బాక్సుల ఒరిజినల్ ఛాయస్ విస్కీ టేట్రా ప్యాకెట్స్ స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. అప్పలకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులు నుండి హేయివార్డ్స్ విస్కీ -55, అంబేద్కర్ నగర్ కి చెందిన రామన్న నుండి హేయివార్డ్స్ విస్కీ -70 డిప్స్‌ను, పాలసముద్రానికి చెందిన వెంకటరాముడు నుండి హేయివార్డ్స్ విస్కీ డిప్స్ -178, అలాగే వీరాంజనేయులు, రామ చంద్రప్ప నుంచి హేయివార్డ్స్ విస్కీ ప్యాకెట్స్ -190 లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. మొత్తం మూడు ద్విచక్ర వాహనాలు, ఒక కారు, కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ. 1.20లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు శంకర్, పోతులయ్య, హెడ్ కానిస్టేబుళ్లుచంద్ర శేఖర్, ప్రకాష్, కానిస్టేబుల్స్ వెంకటరమణ, ఆంజినేయులు, బాలకృష్ణ, మంజువాణి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

వైసిపి ఫ్లెక్సీలు చింపివేత

బత్తలపల్లి : మండలంలోని పోట్లమర్రి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా వైసిపి నాయకులు గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. మంగళవారం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో స్థానిక యువ నాయకులు డి. దినేష్ కుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి సోమవారం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మంగళవారం కార్యక్రమం రద్దు చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మెసేజ్ వచ్చింది. దీంతో కేవలం రెండు ఫ్లెక్సీలను మాత్రమే ఏర్పాటు చేయగా వాటిని అలాగే ఉంచారు. సోమవారం రాత్రి పొద్దుపోయాక గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీలను చింపివేశారు. ఫ్లెక్సీలు చింపివేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామంలోని వైసిపి నాయకులు కోరారు.

న్యాయం చేయాలంటూ వినతి

బత్తలపల్లి : లేని భూమికి పట్టాదారు పాసుపుస్తకం చూపించి డబ్బులు తీసుకున్నారని వారి నుంచి తనకు డబ్బులు ఇప్పించాలని ఓ బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనకు సంబందించి ఎస్ఐ శ్రీహర్ష తెలిపిన వివరాలు... ధర్మవరం పట్టణం గీతానగర్‌కు చెందిన రాజశేఖర్ ఎసిల మెకానిక్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజశేఖర్‌ను నెత్తివారంపల్లికి చెందిన మల్లేషునాయుడు అనే వ్యక్తి కలిశారు. తన తల్లి పేరిట భూమి ఉందనిడబ్బులు అవసరముండి విక్రయిస్తున్నాననిపట్టాదారు పాసుపుస్తకం చూపించాడు. దీంతో రాజశేఖర్ మధ్యవర్తులైన కానగల వెంకటేషు, బుకపట్నం శ్రీనివాసులు, శింగరాయని క్రిష్ణమూర్తి సమక్షంలో రూ.5,3100లు డబ్బులు ముట్టజెప్పాడు. అప్పటి నుండి రిజిస్ట్రేషన్ చేయించమంటే రేపు మాపు అంటూ కాలం వెల్లదీశారు. దీంతో రాజశేఖర్‌కు అనుమానం వచ్చి తహశీల్దార్ కార్యాలయంలో విచారించాడు. 1బిలో మల్లేషునాయుడి తల్లి. పేరు, అడంగల్లో మరొకరి పేరు ఉండటాన్ని గమనించాడు. దీంతో రాజశేఖర్ తనకు జరిగిన అన్యాయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రమణ

రామగిరి : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిషకరించాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని పేరూరు లో స్వచ్ఛభారత్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు జెవి. రమణ, బత్తల కదిరప్ప కౌలు, నామాల నాగార్జున తదితరులు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ ఇఎస్ఐ సౌకర్యం వర్తింపచేయాలని, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. మండల జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరూ ఐక్యంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం మండల కన్వీనర్ నాగరాజ్, ముత్యాలమ్మ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.